## క్లుప్తంగా

### హోలీ సంబురాలు



మడికొండ: మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గురువారం హోలీ సంబురాలను జరుపుకున్నారు. ఉమ్మడి ప్రాంగణం మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో సహజ సిద్ధమైన రంగులతో వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయం సందర్భంగా జరుపుకునే పండుగ హోలీ అని అన్నారు. అందరిని ఒకచోట చేర్చే పండుగ రంగుల హోలీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంగణం సిబ్బంది, శిక్షణ పొందుతున్న విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### కాముడి దహన వేడుకలు



వరంగల్: హోలీ పండుగను పురస్కరించుకుని 19వ డివిజన్ వివేకానంద కాలనీలో అధ్యక్షుడు గాదం కొమురయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాముడి దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రభాకర్, సుధీర్, చందు, రాజేశ్వర్, కిషన్, చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

### దాసోజ్ శ్రవణ్‌కు సన్మానం



హన్మకొండ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి దాసోజ్ శ్రవణ్‌ను మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సన్మానించారు. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికానున్న సందర్భంగా ఆయనను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### కల్వకుంట్ల కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



హన్మకొండ: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ కలిశారు. హైదరాబాద్‌లో శాసన మండలి ఆవరణలో ఆమెను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**'జాగృతి' ఆధ్వర్యంలో అన్నదానం**



హన్మకొండ: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజును పురస్కరించుకుని జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి నామని సాయికృష్ణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సంతోష్, చక్రధర్‌రావు, వినయ్ పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలతో చేటు



హసన్‌పర్తి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై రవి సూచించారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై హసన్‌పర్తి శివారులోని ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో గురువారం కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో పట్టుబడితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, 100 డయల్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్, కళాజాత బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు వినలియ్, వెంకటేశ్వర్లు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్ల పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో పదో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను మేకల వంశ వేదిక ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మేకల వంశ వేదిక అధ్యక్షుడు మేకల యుగంధర్, ప్రధాన కార్యదర్శి మేకల హరిశంకర్, కోశాధికారి శోభన్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, పాఠశాల హెచ్‌ఎం తిరుమలేశ్వర్ రెడ్డి, యాజమాన్య వర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పరీక్ష సామగ్రి అందజేత**

రామన్నపేట: నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి గురువారం పరీక్ష ప్యాడ్లు, కంపాస్ బాక్స్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోదాం పద.. ఎర్రగట్టు జాతరకు..

- నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ఐదురోజుల పాటు వేడుకలు
- నేడు రాత్రి 11.48 గంటలకు కల్యాణం



ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి ఆలయం



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు వేడుకలు కొనసాగనున్నాయి. హసన్‌పర్తి – భీమారం గ్రామాలు సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్నాయి. హోలి వేడుకలు ముగిసిన అనంతరం ఇరుగ్రామాల నుంచి అలివేలు మంగ – వేంకటేశ్వరస్వామి ప్రతిమలను రథాలపై ప్రతిష్ఠించి భారీ ప్రదర్శనలతో ఎర్రగట్టు గుట్టపైకి తీసుకొస్తారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకుంటారు.

**భారీ బందోబస్తు**

ఉత్సవాలను పురస్కరించుకుని జాతరకు భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. ఇద్దరు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు ఏఎస్సైలు, 12మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. 24గంటల పాటు ట్రాఫిక్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**ఏర్పాట్లు పూర్తి**



మూలవిరాట్

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈఓ వెంకట్రామ్ తెలిపారు. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

**ఉత్సవ కమిటీ నియామకం**

జాతరకు ఒక్కరోజు ముందు ఉత్సవ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఆరెల్లి వెంకటస్వామి, డైరెక్టర్లుగా శీలం రమేష్, కనపర్తి రాజు, పోతరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజేందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, అటికం శ్రీనాథ్ గౌడ్, సంగాల ప్రశాంత్ కుమార్‌తోపాటు అర్చకులు వేదాంతం పార్థసారథి చార్యులు, ఆరుట్ల శ్రీనాథాచార్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**ఉత్సవాల వివరాలు**

- శుక్రవారం సాయంత్రం 5గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాల నుంచి స్వామిని ఎర్రగట్టు గట్టు మీదికి తీసుకురావడం, అదేరోజు రాత్రి పెద్దచక్రాల ప్రదర్శన
- రాత్రి 11.48 గంటలకు స్వామి వారి కల్యాణం
- శనివారం సాయంత్రం 7గంటలకు చిన్న చక్రాల ప్రదర్శన
- ఆదివారం విశేష పూజ, కుంకుమార్చనలు, హారతి ప్రసాద వినియోగాలు
- సోమవారం క్షీరాభిషేకం, అర్చనలు
- మంగళవారం సాయంత్రం 6గంటలకు స్వామి వారు హసన్‌పర్తి – భీమారం గ్రామాలకు వెళ్లడం

## జియాలజీలో విశ్లేషణాత్మక పద్ధతులు కీలకం

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: జియాలజీలో విశ్లేషణాత్మక పద్ధతులు కీలక భూమిక పోషిస్తాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ జియాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ సంస్థలు అనుసరించే విధానాలను విద్యార్థుల అవగతం చేసుకోవాలన్నారు. ఎన్‌జీఆర్‌ఐ జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు విశ్వవిద్యాలయాల విద్యార్థులకు అందిస్తున్న సహాయాన్ని కొనియాడారు. వర్క్‌షాప్‌లో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్‌జీఆర్‌ఐ చీఫ్ సైంటిస్టు డాక్టర్ శ్రీనివాస్, సైంటిస్టు డాక్టర్ వాసంతి శర్మ, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

## 21న బహుభాషా కవి సమ్మేళనం



నయీంనగర్: మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుభాషా కవి సమ్మేళనాన్ని హనుమకొండ హోటల్ అశోకా హోటల్‌లో నిర్వహించనున్నట్లు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యులు సిరాజుద్దీన్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవులు ప్రపంచానికి ఏమవుతారు అనే శీర్షికన కవి సమ్మేళనం జరుగుతుందని అన్నారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్ భాషలకు చెందిన పటిష్టమైన 25 లైన్లకు మించని కవితలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య రవికుమార్, పి.రాజ్‌కుమార్, వి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలకు అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న శ్రీధర్ కుమార్‌లోథ్

కేయూ క్యాంపస్: త్వరలోనే ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో యూనివర్సిటీలు, విద్యారంగానికి అధికంగా నిధులు కేటాయించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి కనీసం 20శాతం నిధులు, 12 యూనివర్సిటీలకు రూ.1,700ల కోట్లు కేటాయించాలని సూచించారు. ప్రగతి పద్దు కింద రూ.5 వేల కోట్లు, కాకతీయ యూనివర్సిటీకి రూ.180 కోట్లు ఇవ్వాలని కోరారు. అలాగే, కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా మార్చాలని పేర్కొన్నారు. సమావేశంలో బాధ్యులు లక్ష్మీనారాయణ, దాసు, సదానందం, దేవేంద్రచారి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వెంటనే వేతనాలివ్వాలి

- బల్దియా ఎదుట సీఐటీయూ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

వరంగల్ అర్బన్: బల్దియా పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, అర్బన్ మలేరియా, ఇతర విభాగాల్లోని ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఫిబ్రవరి నెల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆవరణలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకు పోరాటం కోసం అష్టకష్టాలు పడుతున్న కార్మికులకు ప్రతినెలా మొదటి తారీఖున వేతనాలు అందించాలన్న స్పృహ అధికారులకు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సింగారపు బాబు, నాయకులు సింగారపు కృష్ణ, జీవన్, వ్యాస బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను ముందుకు తీసుకెళ్లాలి



సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నయీంనగర్: హనుమకొండ జిల్లాను అందరు కలిసి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ సూచించారు. ఇక్కడి నుంచి వెళ్లడం బాధగా ఉందని, పదోన్నతి కాబట్టి తప్పకవెళ్లాల్సి వస్తోందని అన్నారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా పనిచేసి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై ఖమ్మం జిల్లాకు వెంకటనారాయణ వెళ్తున్న సందర్భంగా సహ ఉద్యోగులు హనుమకొండ ఎంఎల్ గ్రాండ్ బాంక్వెట్ హాల్‌లో ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ కె.విజయ భాస్కర్, టీజీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.జగన్‌మోహన్ రావు, హనుమకొండ జిల్లా టీజీఓ అధ్యక్షుడు డి.మురళీధర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, టీఎన్‌జీఓ అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమన్న, జిల్లా ట్రెజరీ అధికారి ఆకవరం శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'ఎలైట్ తరంగ్'



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు

హన్మకొండ: ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎలైంట్ తరంగ్ కార్యక్రమం సాగింది. ఎన్జీవోస్ కాలనీ –2 ఫేజ్ 100 ఫీట్ల రోడ్డులోని ఎలైట్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎలైంట్ తరంగ్ వార్షికోత్సవం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హనుమకొండ లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ విద్యార్థులను ప్రావీణ్యులను చేస్తున్న స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హడుప్స్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్, ఎలైట్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మాడుగుల రాజిరెడ్డి, కరస్పాండెంట్ ఎం.హరితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**యువ ఉత్సవ్‌లో 'ఎల్‌బీ' విద్యార్థుల ప్రతిభ**



రామన్నపేట: ఇటీవల నగరంలోని బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన యువ ఉత్సవ్ 2024 –25లో ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ విభాగంలో ఎల్‌బీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ ముజామిల్ షరీఫ్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి, మిగతా వారు ఇతర బహుమతులు సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డితో పాటు సాంస్కృతిక విభాగం కన్వీనర్ సతీష్‌కుమార్, సభ్యులు, అధ్యాపకులు గురువారం అభినందించారు.

**పండితులకు సన్మానం**

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను జరిపించిన పండితులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసిన అర్చకులు, పండితులకు శాలువాలు కప్పి నగదు పురస్కారాలతో సత్కరించారు. ఆలయ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్‌గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, తిరునగరి దిలీప్ కుమార్, ఐలోని వెంకట మల్లారెడ్డి, పెద్ది అశోక్ కుమార్, రాచర్ల శంకరయ్య, వంగాల సత్యనారాయణ రెడ్డి, శనిగరపు సుజాత తదితరులు పాల్గొన్నారు.

**విజయవంతంగా ముగిసిన వర్క్‌షాపు**

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జీవ రసాయన, సంశ్లేషణ, ఔషధ రసాయన శాస్త్రం – స్పెక్ట్రల్ విశ్లేషణలో తాజా పురోగతులు' అనే అంశంపై అకాడమీ లెక్చర్ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. జాయింట్ ఇండియన్ అకాడమి సైన్సెస్ స్పాన్సర్ చేసిన ఈ వర్క్‌షాపులో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రామాచారి, ఐఐసీటీ ప్రొఫెసర్ రవిశంకర్, ఐఐసీటీ ప్రొఫెసర్ రాజిరెడ్డి, బిట్స్ హైదరాబాద్ ప్రొఫెసర్ మహిపాల్ రెడ్డి ప్రసంగించారు. గురువారం జరిగిన ముగింపు సమావేశంలో కేయూ ప్రొఫెసర్ సబితా జ్యోత్స్న, ప్రొఫెసర్ మమత, ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ పి.హరీందర్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, రసాయన శాస్త్ర విభాగ అధిపతులు గోవిందరావు, రజిత, అధ్యాపకులు రాజేంద్ర ప్రసాద్, విక్రమ్ పాల్గొన్నారు.

**అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలను పూర్తి చేయాలి**

రామన్నపేట: నగరంలోని పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ డిమాండ్ చేశారు. రామన్నపేటలోని పలు కాలనీల్లో సీపీఎం బృందం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పులిమాటి శివ, రమేష్ శంకర్, సూరం కుమార్, మాదాసు వీరస్వామి, దుప్పటి బాబు, సురేందర్, కిరణ్, ఆరెపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి**

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాలలో అవకతవకలకు పాల్పడిన మాజీ ప్రిన్సిపాల్‌పై, అలాగే, ఆ కళాశాలలోని ఓ పార్ట్‌టైం లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని గౌడ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ రామచంద్రంకు గురువారం వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా వారు పలువురు విద్యార్థుల నుంచి వివిధ కారణాలతో డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**రాయప్రోలు సుబ్బారావు జయంతి**



కేయూ క్యాంపస్: కవి, విమర్శకుడు, జాతీయవాది, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మొదటి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన దివంగత రాయప్రోలు సుబ్బారావు జయంతి వేడుకలను కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, తెలుగు విభాగం అధిపతి డాక్టర్ సదాశివ్, అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికుమార్ పాల్గొన్నారు.

**ఆశ్రమంలో అన్నదానం**

విద్యారణ్యపురి: మంద కొమురమ్మ 11వర్ధంతి సందర్భంగా మంద కొమురయ్య కొమురయ్య సేవాసమితి ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సికిందర్, బాధ్యులు దాసరి శ్రీకాంత్, కుమార్‌యాదవ్, జన్నం సునీల్, గౌస్‌పాషా, సింగారపు సుశీల్, ఆనందరావు, ఆశ్రమ నిర్వాహకురాలు మమత పాల్గొన్నారు.

**ఘనంగా మొల్లమాంబ జయంతి**

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని శాలివాహన కమ్యూనిటీ భవనంలో కుమ్మరి డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ శంభునిపేట ఆధ్వర్యంలో తెలుగు కవయిత్రి, కుమ్మరి కులస్తురాలు మొల్లమాంబ 585వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆవునూరి రవి, కందికొండ మోహన్, కుమారస్వామి, భిక్షపతి, దేవేందర్, రాంబాబు, రాజేష్, శ్రీను, విష్ణు పాల్గొన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న రిటైర్డ్ డీసీ**

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వరంగల్ జోన్ దేవాదాయ ధర్మాదాయశాఖ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ టి.రమేష్‌బాబు దంపతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**దడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ చెల్లించాలి**

వరంగల్: రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకొస్తే అనేక రకాల చార్జీలు వసూలు చేస్తున్నారని, రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలంటే బస్తాలు తూకం వేసే దడువాయి చార్జీలను మార్కెట్ కమిటీలు భరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని సచివాలయంలో గురువారం కలిసి మెమోరాండం అందించారు.

**13 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం**

ఖిలా వరంగల్: కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేసిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. నిందితురాలు కస్తూరి లలితపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

**ఇసుక లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం**

మడికొండ: ప్రమాదవశాత్తు ఇసుక లారీ బోల్తా పడిన సంఘటన మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 5గంటల సమయంలో భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ.. ఔటర్ రింగ్ రోడ్డు పరికికుంట వద్ద డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న కల్వర్టును లారీ ఢీకొట్టి బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

**కిడ్నీలపై నిర్లక్ష్యం తగదు**

ఖిలా వరంగల్: శరీరంలోని మలినాలు, ఇతర వ్యర్థాలను నిరంతరం వడపోసే కిడ్నీల పనితీరుపై నిర్లక్ష్యం చేయొద్దని, తరచూ బీపీ, షుగర్ నియంత్రణలో ఉంచుకోవాలని యశోద ఆస్పత్రి సికింద్రాబాద్ డాక్టర్ పొన్న అరుణ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని పల్లవి ఆస్పత్రిలో గురువారం కిడ్నీ వైద్య పరీక్షలు నిర్వహించారు.

**ముందస్తు పరీక్షలతో మూత్రపిండాల పరిరక్షణ**

వరంగల్: ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల మూత్ర పిండాలను పరిరక్షించుకోవచ్చని అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 3వ డివిజన్ కొత్తపేట క్రాస్‌రోడ్డులోని అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ ఆస్పత్రిలో అపోలో డయాలసిస్ క్లినిక్‌లో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

**ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి**

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తర్వాతే నియామకాలు చేపట్టాలని మాదిగలకు న్యాయం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ డిమాండ్ చేశారు. ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు.

**కొనసాగుతున్న రిలే దీక్షలు**

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 5వ రోజుకు చేరుకున్నాయి.

**బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట..**

వరంగల్ అర్బన్: వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్‌తో వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్షలు గురువారం 4వ రోజుకు చేరాయి.

## ఉద్యమకారులను అణచివేసిందే బీఆర్ఎస్

- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న తోట వెంకటేశ్వర్లు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ మలిదశ ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ జయశంకర్ సార్ లాంటి మహానుభావులను అవమానించి, అనేక మంది ఉద్యమకారులను అణచివేసిందే బీఆర్ఎస్ పార్టీ అని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సెంటిమెంట్‌ను వాడుకుని పదేళ్ల తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ పార్టీ.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకే వరంగల్‌లో సభ పెడుతోందని ఆరోపించారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని 16 నెలల్లో కాంగ్రెస్ సర్కార్ చేసిందని వివరించారు. అది మింగుడుపడని బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ సర్కార్‌పై పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ, పల్లకొండ సతీష్, మంద రాకేష్, ఎస్.కుమార్ యాదవ్, అంకూస్, సురేందర్ పాల్గొన్నారు.

## ఉద్యోగం చేస్తూనే.. గ్రూప్ 2లో సత్తా



శ్రావణి, రమ్యను సన్మానిస్తున్న తహసీల్దార్

- జూనియర్ అసిస్టెంట్లకు సన్మానం

ఖిలా వరంగల్: నగరంలోని తూర్పుకోటకు చెందిన బిల్లా రవికుమార్, రజిత దంపతుల కుమార్తె బిల్లా శ్రావణి, రంగశాయిపేట నాయుడు పెట్రోల్ బంక్ ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, శ్రీలత దంపతుల కుమార్తె వాసిరెడ్డి రమ్య నాలుగు మాసాల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించి బాధ్యతలు చేపట్టారు. ఈనెల 10న విడుదలైన గ్రూప్ –2 ఫలితాల్లో బిల్లా శ్రావణి రాష్ట్రస్థాయిలో 126వ ర్యాంక్, మహిళా కోటలో 6వ ర్యాంకు సాధించగా.. ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీ –2023 ఫలితాల్లో వాసిరెడ్డి రమ్య.. ఈసీఈ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ సాధించి వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగాన్ని సాధించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో శ్రావణి, రమ్యను తహసీల్దార్ నాగేశ్వర్‌రావు సన్మానించారు. నాయబ్ తహసీల్దార్ గడ్డం రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మిద్దెల కీర్తన్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

## కార్మిక భవనం కూల్చివేతపై విచారణ



తహసీల్దార్‌కు వివరాలు అందిస్తున్న నాయకులు

వరంగల్: లక్ష్మీపురంలోని ఏజే మిల్స్ కార్మికులకు చెందిన కార్మిక భవనం కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ చేపట్టింది. వాస్తవాలను కమిషన్ దృష్టికి తీసుకుపోవాలని వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్‌ను కార్మిక భవనం పరిరక్షణ సమితి నాయకులు గురువారం కోరారు. గతంలో కార్మిక భవనం కూల్చివేయడంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఏజేఎం వర్కర్లు, దళిత కార్మికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కమిషన్.. విచారణ జరిపి నివేదిక అందించాలని కలెక్టర్‌ను ఆదేశించగా వరంగల్ తహసీల్దార్‌ను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. ఈమేరకు జరిగిన విచారణలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో వర్కర్స్‌కు చెందిన కార్మిక భవనం పూర్తి ఆధారాలు, వివరాలను పరిరక్షణ సమితి నాయకుల ఆధ్వర్యంలో దళిత కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పరిరక్షణ సమితి నాయకులు గంగుల దయాకర్, కొనతం కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, అకెన వెంకటేశ్వర్లు, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, మార్టిన్ లూథర్, దళిత, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)